క్లుప్తంగా...

నేడు సీఎం బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రవేశపెడుతున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకంను శుక్రవారం ఉదయం 8.30గంటలకు గండిపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభిస్తున్నట్టు కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బండ్లగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు బండ్లగూడ మెయిన్ రోడ్డు, ఆదర్శనగర్, కాళీకానగర్, కాళీమందిర్, ఎస్ఎఫ్‌సి కాలనీ, మల్లికార్జుననగర్, ద్వారకానగర్, యాదవ మిత్ర కాలనీ, షిరిడి సాయిబాబా కాలనీ, వికాస్‌నగర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంత్‌కాలనీ, క్రేయాన్స్ ఆసుపత్రి తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వంటావార్పు



వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టిన కార్మికులు

శంషాబాద్ : తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన దీక్ష గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేష్ మాట్లాడుతూ..మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర సర్కారు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. వెంటనే చర్చలకు పిలిచి వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

స్థలం, కాలానుగుణంగా సంస్కృతులు పుట్టుకొస్తాయి

హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: విశ్వైక భావనకు ప్రేరణే తులనాత్మక సాహిత్య అధ్యయనం అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులకు జరుగుతున్న తులనాత్మక సాహిత్యం పునశ్చరణ తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా ఆన్‌లైన్‌లో హెచ్‌సీయూ తెలుగుశాఖ కార్యాలయం నుంచి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులనాత్మక సాహిత్య అధ్యయనం వల్ల భిన్న భాషలలో గల సంస్కృతీ సాంప్రదాయాలు తెలుస్తాయన్నారు. స్థలం, కాలానుగుణంగా సంస్కృతులు, సాంప్రదాయాలు పుట్టుకొస్తాయని, దేన్నీ తక్కువగా చూడకూడదనే అవగాహన కలగడం కూడా తులనాత్మక అధ్యయన ప్రధాన కారణమన్నారు. తులనాత్మక అధ్యయనం ద్వారానే లోతుగా పరిశీలిస్తే ఒకరినొకరు పోల్చుకోవడం నుంచి మొదలై రాష్ట్రాలు, దేశాల మధ్య అనేక విషయాల్లో పోల్చుకోవడం జరుగుతుందన్నారు. సమన్వయకర్తగా ఆచార్య నాగేంద్ర, చర్చలో డాక్టర్ నిర్మల, డాక్టర్ శ్రీనివాస్, లెఫ్టినెంట్ డాక్టర్ షమీర్‌బాబు, ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పొదిలి నాగరాజు సమీక్షతో వందన సమర్పణ సాగింది.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. 'హెల్తీ అండ్ హ్యాపీ ఫ్యామిలీస్'(బాండింగ్ త్రూ ఫిజికల్ లిటరసీ) అనే అంశంపై దేశంలోని పలు ఫిజికల్ లిటరసీ పాలసీలో ఫిజికల్ లిటరసీ అడ్వకేట్ డాక్టర్ అమిత్ మాలిక్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

గోల్కొండ: ఉషోదయ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు జలమండలి జీఎం మహేందర్‌ను కోరారు. వారు గురువారం గుడిమల్కాపూర్‌లోని జలమండలి కార్యాలయంలో జీఎం మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డుపై మురుగు నీటితో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇళ్లల్లోకి మురుగు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉండే ప్రజలు డ్రైనేజీ సమస్య కారణంగా అనారోగ్యాల బారినపడుతున్నారన్నారు. స్థానిక అధికారులకు ఈ డ్రైనేజీ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత కాలనీ అధికారితో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని జనరల్ మేనేజర్ మహేందర్ తనకు కలిసిన వారికి హామీ ఇచ్చారు. బీజేపీ నాయకుడు దేవర వంశీతో పాటు ఉషోదయ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులున్నారు.

పండుగలు సంతోషంగా జరుపుకోవాలి



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు అధికారిణి రాధారాణి



ఖానాపూర్‌లో బతుకమ్మ చీరలు అందజేస్తున్న కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారిణి రాధారాణి మాట్లాడుతూ... ప్రభుత్వం 16,000 బతుకమ్మ చీరలను సర్కిల్ పరిధిలోని మహిళలకు పంపిణీ చేసేందుకు అందించిందన్నారు. వీటిని 60 సెంటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ఈ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల వద్దకు తమ ఆహారభద్రత కార్డు, ఆధార్ కార్డు పత్రాల జిరాక్స్‌లను తీసుకొచ్చి బతుకమ్మ చీరలను పొందాలని సూచించారు.

మణికొండ: దసరా పండగకు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలను గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో కౌన్సిలర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు జి. శివారెడ్డి, ఆర్. ఆదిత్యరెడ్డి, పత్తి ప్రవీణ్‌కుమార్, జి.అమరేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ పేద ప్రజలు పండగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చీరలను పంపిణీ చేస్తుందన్నారు.



నార్సింగిలో.. కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్



కోకాపేటలో..కౌన్సిలర్‌లు శివారెడ్డి, ఆదిత్యరెడ్డిలు

సంక్షేమం అంటేనే కాంగ్రెస్

నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్



నార్సింగిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్

మణికొండ: పేద ప్రజలకు ఆరోగ్య శ్రీ, ఇందిరమ్మ ఇంటి స్థలాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, అర్హులందరికీ రేషన్ కార్డులను అందించి సంక్షేమం అంటేనే కాంగ్రెస్ అనేలా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలన కొనసాగిందని, తిరిగి అలాంటి పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పార్టీ అధినాయకత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేసే ఆరు సంక్షేమ పథకాలను ఇంటింటికీ కరపత్రాలను అందించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే సంక్షేమానికి మార్గదర్శకం చేసిందే డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు అందుతున్న ఫీజు రీయింబర్స్ మెంట్ ఆలస్యం, ఆరోగ్య శ్రీ కార్డులను ప్రైవేటు ఆసుపత్రుల వారు అంగీకరించకపోవటంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన అర్థం చేసుకోవచ్చారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఇంటికి పంపి ప్రజలందరికీ మేలు చేసే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలని ప్రజలందరూ నిర్ణయించుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాపిరెడ్డి, కౌన్సిలర్‌లు లక్ష్మీప్రవళిక, దుర్గేష్‌యాదవ్, విజయ్‌బాబు, ఉషారాణి, నాయకులు వేణుగౌడ్, కిరణ్‌కుమార్, వినోద్‌కుమార్, నవీన్ కుమార్, రాము, డి.లక్ష్మణ్, అశోక్‌లతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నార్సింగిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీ

రూ.18.45కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



నార్సింగిలో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ ,వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు, నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ అభివృద్ధితో బాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట, మంచిరేవుల, నార్సింగి గ్రామాలలోని పలు వార్డులలో రూ.18.45 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మోడ్రన్ లైటింగ్, బీటీ రోడ్లు, పశువుల మార్కెట్ షెడ్, ప్రీ ప్రైమరీ పాఠశాల భవనం, బీజేఆర్ కమ్యూనిటీహాల్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సమస్యలు పెరుగుతున్నాయని, వాటి పరిష్కారానికి మున్సిపల్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ నిధులను రాబట్టి పనులను చేపడుతున్నామన్నారు.కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ బి. సురేందర్‌రెడ్డి, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మెన్ డి. వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కౌన్సిలర్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన.. జైలుశిక్ష

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి, మద్యం సేవించి, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపిన 15 మందిపై ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో గురువారం చార్జిషీట్లను నమోదు చేశారు. రాజేంద్రనగర్ మూడవ స్పెషల్ ఎంఎం కోర్టు న్యాయమూర్తి నలుగురికి జైలు శిక్ష, మిగిలిన 11 మందికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తప్పనిసరిగా వాహన యజమాని జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

'వికలాంగులకు అండగా ఉంటా'

గోల్కొండ: వికలాంగులకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం గోల్కొండలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ ఆలీ ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వికలాంగుల స్వయం ఉపాధి కోసం తాను అండగా ఉంటానని దీని కోసం పార్టీ తరఫునే కాకుండా ప్రభుత్వం పరంగా కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి



మాట్లాడుతున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ వెల్లడించారు. గురువారం సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1.73 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు, మెయింటెనెన్స్‌కు సంబంధించిన పలు పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజావసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటికి అనుగుణంగా నిధులను కేటాయించి అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, మంచినీరు, పారిశుధ్యం, పార్కుల అభివృద్ధి, శ్మశానవాటికల అభివృద్ధి, హరితహారంలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, తలారీ చంద్రశేఖర్, పద్మావతి పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతిపాపయ్య, నిఖిలసంగారెడ్డి, ప్రశాంత్‌నాయక్, అస్లాం బిన్ అబ్దుల్లా, ముద్దం రాము, ఆసియాఖాజా, పుష్పమ్మశ్రీనివాస్, శ్రవంతినరేందర్, అనిల్ వెంకటేష్, మున్సిపల్ అధికారులు మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ యాదయ్య, టిఎస్ఆర్‌సీ, సీపీడీసీఎల్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పెద్ద తాలకుంట చెరువు సందర్శన



పెద్ద తాలకుంట చెరువును పరిశీలించిన ఏఈ నరేందర్‌గౌడ్ తదితరులు

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ పెద్ద తాలకుంట బతుకమ్మ చెరువును చేవేళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి పిలుపు మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేందర్‌గౌడ్ గురువారం సందర్శించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదర్‌గూడ శివానగర్, కృష్ణనగర్, కేశవ్‌నగర్, ఉప్పర్‌పల్లికి చెందిన మహిళలు బతుకమ్మలను పెద్ద తాలకుంట చెరువులో వదులుతారని, ఈ సందర్భంగా ఈ చెరువును బాగు చేస్తామన్నారు. గడ్డి, చెత్త, గుర్రపుడెక్కను తొలగింపు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ నర్సింహమూర్తి, వీరారెడ్డి, రాజు, అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాధ విజయ్‌కుమార్, కిరణ్‌చారి, సాయి యాదవ్, మణికంఠ తదితరులు సందర్శించారు.

16 నుంచి 'విద్యలో ఏఐ'పై శిక్షణ

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్ (సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో 'విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అయిదు రోజుల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని ఖురాన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే శిక్షణలో పాల్గొనేవారు ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందించబడునన్నారు. మరిన్ని వివరాలకు సెంటర్ ఫ్యాకల్టీ డాక్టర్ మిస్బా అంజూర్(9948412484), డాక్టర్ మహ్మద్ అక్బర్(8373984391)లో సంప్రదించాలని కోరారు.

విగ్రహావిష్కరణ..చేవెళ్లకు తరలిన ముదిరాజ్‌లు



సర్కిల్ అధ్యక్షులు సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో బయలుదేరిన సంఘం నాయకులు

రాజేంద్రనగర్: తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగల సాయన్న ముదిరాజ్ విగ్రహావిష్కరణకు రాజేంద్రనగర్ సర్కిల్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఉదయం రాజేంద్రనగర్ సర్కిల్ నుండి సర్కిల్ అధ్యక్షులు డి.సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ర్యాలీగా చెవేళ్లకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. చేవేళ్ల నియోజకవర్గం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణకు సర్కిల్‌లోని ముదిరాజ్ కులస్తులంతా తరలి వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో మన్నే మహాత్మారావు ముదిరాజ్, నార్సింగి నరసింగరావు ముదిరాజ్, కోల మీద యాదయ్య ముదిరాజ్, బి.బాలరాజు ముదిరాజ్, డి.రమేశ్ ముదిరాజ్, లక్ష్మీగూడ నర్సింగ్ రావు ముదిరాజ్, సర్కిల్ నాయకులు పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీ విద్యార్థుల ధర్నా

ఏజీవర్సిటీ: ప్రభుత్వం ఉద్యానవన శాఖలో పోస్టులు భర్తీ చేయకుంటే తాము చదువుకున్నా ఉపయోగం లేదంటూ రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండ లక్ష్మణ ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థులు రెండో రోజు గురువారం ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. తెలంగాణ ప్రభుత్వం 20 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫాం సాగు చేయాలని ప్రకటించిందని దీనికి కనీసం మండలానికి ఒక అధికారి ఉండాలని కాని నియోజకవర్గానికి సైతం ఒక ఉద్యానవన అధికారి లేదని ఆయిల్ ఫాం సాగు ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు.



ఉద్యాన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ధర్నా

మళ్లీ అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



సీసీరోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

గచ్చిబౌలి/రాయదుర్గం/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం రూ.1.80 కోట్లతో లింగంపల్లి, తారానగర్, గోపీనగర్, నెహ్రూనగర్, సుదర్శన్‌నగర్, ఇందిరానగర్ లలో సీసీరోడ్ల నిర్మాణానికి, గచ్చిబౌలి డివిజన్‌లో రూ. 2.98 కోట్లతో గుల్‌మోహర్‌పార్కులకాలనీ, నేతాజీనగర్, గోపన్‌పల్లి, టీఎన్‌జీఓకాలనీ, నానక్‌రాంగూడ, రాయదుర్గంలోని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులకు ఆయన కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గ్రూప్ వన్ ప్రిలిమ్స్ రద్దుకు నిరసనగా ర్యాలీ



ర్యాలీగా వస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

శంషాబాద్: గ్రూప్ వన్ ప్రిలిమ్స్ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో విఫలమవుతున్న ప్రభుత్వం అధికారులతో పాటు మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిదేళ్లలో ఏ పరీక్షలను కూడా ప్రభుత్వం సక్రమంగా నిర్వహించలేదన్నారు. మద్యం నోటిఫికేషన్‌లను మాత్రం సక్రమంగా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్, ప్రదీప్, అఖిల్, చరన్, చందు, భారత్, భార్గవ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను ఆదుకోవడానికి సేవా సంస్థలు, దాతలు ముందుకు రావాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మణికొండ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 213 మంది వికలాంగులు, శారీరక, మానసిక ఎదుగుదల లేని విద్యార్థులకు ఐషిత కమ్యూనిటీ అసోసియేషన్ తరఫున తరగతి గది పార్టిషన్, బస్‌పాస్‌లను అందచేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, కౌన్సిలర్ వసంతరావు, నాయకులు శ్రీరాములు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో గుజరాత్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గురువారం జంట యోగిని కార్నేకర్ శిష్యబృందం కథక్ నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో గణేశ్‌వందన, రామశ్లోక, కృష్ణరాస్, క్రిస్‌వందన, తరణ, రాధాకృష్ణహోరి, కృష్ణభజన, గర్భ నృత్యాలతో అలరించారు. – మాదాపూర్